క్లుప్తంగా

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



మక్తల్: మక్తల్‌కు చెందిన ఓ పత్రిక రిపోర్టర్, లయన్స్ క్లబ్ సెక్రటరీ అంబదాస్‌కు హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరామర్శించారు. అంబదాస్‌కు బైపస్ సర్జరీ కావడంతో వైద్యులతో ఆరోగ్య వివరాలు ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు.

68 మంది విద్యార్థులు గైర్హాజరు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో 4వ రోజు సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 3844 మంది విద్యార్థులకు గానూ 3776 మంది విద్యార్థులు హాజరై 68 మంది గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 3305 మందికి 3256 మంది హాజరై 49 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 539 మందికి గాను, 520 మంది హాజరై 19 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్‌రావు తెలిపారు.

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వమే ముద్దు

● ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌గౌడ్



మాగనూర్: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు వయస్సు తక్కువగా ఉంటుంది. కాబట్టి బస్సులు, ఆటోలో ఇతర ప్రైవేట్ వాహనాలు ఎక్కి ఎన్నో ప్రమాదాల బారిన పడుతుంటారని ఇన్‌చార్జి ఎంఈఓ అనిల్‌గౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. మండలంలోని తల్లిదండ్రులు, విద్యాభిమానులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించి వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఆయన పేర్కొన్నారు. భవన సదుపాయం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధం లేదన్నారు. పాఠశాల భవనాలను అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించారని, వాటిని పాఠశాలలకు అప్పగించాలని పేర్కొన్నారు.

అచ్చీవర్ అకాడమీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో అచ్చీవర్స్ అకాడమి చౌక్ బజార్ వారు పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అచ్చీవ్‌మెంట్ ట్యాలెంట్ టెస్ట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ముఖ్యవక్తలుగా హాజరైన పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఉమా శంకర్, వెటర్నరీ వైద్యుడు శ్రీనివాస్‌లు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100పై అసత్య ప్రచారం

మాగనూర్: మండంలోని కోల్పూర్ గ్రామానికి చెందిన స్వామిగౌడ్ డయల్ 100పై అసత్య ప్రచారం, వీడియోలు, డయల్ 100ను మిస్ యూస్ చేయడంతో కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.అశోక్‌బాబు తెలిపారు. స్వామిగౌడ్ కొద్ది రోజులుగా డయల్ 100పై అసత్య ప్రచారం, వీడియోలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీంతో అతనిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కేసు నమోదు

మాగనూర్: మండల కేంద్ర సమీపంలోని రైల్వే వంతెన సమీపం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా టిప్పర్ ద్వారా మొర్రం తరలిస్తుండగా డ్యూటీలో ఉన్న వీఆర్‌ఏ బాల్‌రాజ్ పట్టుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆదేశాలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీంతో బాల్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ ఓనర్ లింగప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.అశోక్‌బాబు తెలిపారు.

మహిళా విద్యాప్రదాత సావిత్రీబాయి



నర్వ బీసీ భవనంలో సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు



నారాయణపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



మక్తల్‌లో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నారాయణపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బీసీ జాగృతి సేన సభ్యులు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి కృష్ణ యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షులు కురుమయ్య, గణేష్, నారాయణ, కాశప్ప, నరసింహులు, మహేష్, చిట్టెమ్మ, రాణి, నాగమ్మ, బుజ్జి పాల్గొన్నారు.

■ భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళా విద్యకు పునాది వేసింది సావిత్రీబాయి పూలే అని బీసీ సంఘం మండల అధ్యక్షులు సుధీర్ అన్నారు. నర్వ బీసీ భవనంలో సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నేటి మహిళాలోకానికి ఆదర్శ వనిత సావిత్రీబాయి పూలే అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రఫీ, రాంచంద్రి, ఆటో రమేష్, యాంకి శివ, ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

■ మక్తల్ పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాల్లో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పృథ్వీరాజు, పోలప్ప, శ్రావణ్, వెంటకయ్య, విజయ్‌కుమార్, రాకేష్, జీరగల్ నాగేష్, నారాయణ, నర్సింహులు, రాజు, యాదగిరి, రవికుమార్, నరేష్, శ్రీహరి, అనిల్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలు



పీఏసీఎస్ సమావేశంలో చైర్మన్ భీంరెడ్డి, డైరెక్టర్లు

కోస్గి: స్థానిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఆసక్తి ఉన్న రైతులకు దీర్ఘ కాలిక రుణాలు ఇస్తున్నామని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేసినట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకం, గేదెల పెంపకం, కోళ్ల పెంపకం, ట్రాక్టర్ కొనుగోలు, పంపుసెట్లు, హార్వెస్టర్ల కోసం రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలో ఆసక్తి ఉన్న రైతులు కోస్గి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రైతులు తమ భూములను తనఖా పెట్టి ఈ రుణాలు పొందాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

‘హక్కుల సాధనకు లక్ష సంతకాల సేకరణ’

నారాయణపేట టౌన్: స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆ సంస్థ జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రాధమ్మ, కాశప్ప డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న గ్రామ పంచాయతీ, పుర పాలికలు, మండల, జిల్లా పరిషత్‌లల్లో ఇద్దరు వికలాంగులను నామినేటెడ్ చేయడానికి ప్రత్యేక చట్టం చేయాలని వారు కోరారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్ దగ్గర ‘హక్కుల సాధనకు లక్ష సంతకాల సేకరణ’ ఉద్యమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30వరకు వికలాంగుల హక్కుల సాధన కోసం సంతకాల సేకరణతో పాటు దశల వారీగా ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు మల్లేష్, బాల్‌రాజ్, బసవరాజ్, రవి, కే.రాములు, వెంకటయ్య, మల్లేష్, బీరప్ప, లక్ష్మణ్, శ్రీహరి, హనుమంతు పలువురు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



దేవాలయానికి విరాళం అందిస్తున్న రామయ్య ఫౌండేషన్ నిర్వాహకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని అప్పజినగర్ వీధిలో కొలవైన లోకాయపల్లి లక్ష్మమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి భద్రాద్రి రామయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పిల్లికండ్ల రామయ్య ఆయన తల్లితండ్రులు జయశ్రీ, వెంకట్రాములు రూ.51,116లు దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఇందులో ఫౌండేషన్ సభ్యులు సతీష్‌కుమార్, దేవాలయ కమిటీ సభ్యులు బాలస్వామి, రాజు, లక్ష్మణ్, నరసింహులు, గోవిందు, రవి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం..

మండల కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థుల స్పెషల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లోని విద్యార్థులకు విద్యుదీకరణ కోసం రూ.5వేలు పాఠశాల ఉపాధ్యాయులు రాకేష్‌కు అందజేశారు. ఇందులో పాఠశాల హెచ్ఎం నరసింహచారి పాల్గొన్నారు.

రైతులను ముంచిన వరిసీడ్స్



మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతు

మాగనూర్: వివిధ కంపెనీలు తయారు చేసిన వరిసీడ్స్ వేస్తే అధిక దిగుబడి, పంటకు అధికలాభం వస్తుందని ఆశించిన రైతుల ఆశలు ఆవిరైపోయాయి. మాగనూర్ మండల కేంద్రానికి చెందిన రైతులు జైపాల్‌రెడ్డి, వర్కూర్ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, వడ్వాట్ గ్రామానికి చెందిన గోపాల్ లు దాదాపు 44 ఎకరాలు నకిలీ సీడ్స్ వల్ల తీవ్ర నష్టం జరిగిందని ఆందోళన చెందుతున్నారు. సీడ్స్ లోపం వల్ల 35 రోజులలో నాటు వేసినప్పటికీ వరినారు పెరగకుండానే 80 రోజులలోపే వెన్ను రావడం, సగం వరిలో వెన్ను లేకపోవడంతో విత్తనాల లోపం వల్లే పొలంలో ఇలా జరుగుతుందనే అభిప్రాయంతో రైతులు మండల వ్యవసాయ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సీడ్స్ మక్తల్ పట్టణంలోని ఓ(శ్రీవెంకటేశ్వర) ఫర్టిలైజర్ షాపులో ఆర్ఎస్ఆర్, విష్ణు మహింద్ర సీడ్స్ వల్ల జరిగిన నష్టానికి రైతులకు నష్టపరిహారం కంపెనీల నుంచి ఇప్పించాలని అధికారులను కోరారు. ఫిర్యాదు చేసి దాదాపు 20 రోజులు గడిచిన, పంటను పరిశీలించడం తప్ప అధికారులు కనీసం శాస్త్రవేత్తలను పిలిపించి సమస్యను వెలికి తీసే ప్రయత్నం చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని జరిగిన నష్టానికి రైతులకు పరిహారం అందేవిధంగా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న దాతలు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల, వైదిక పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ అశోక్ కుమార్ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట టౌన్ ప్రసిడెంట్ రఘుబాబు, కార్యదర్శి మహేష్ గౌడ్, కోశాధికారి సంజీవరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రామాంజనేయులు, మిర్చి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



బాటసారులకు అంబలి అందజేస్తున్న ఎస్ఐ రాము

మరికల్: మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అంబలి కేంద్రం ఎస్ఐ రాము ప్రారంభించారు. అంతకుముందు అయ్యప్ప చిత్రపటానికి పూజలు చేసి బాటసారులకు, వాహనదారులకు ఎస్ఐ, అయ్యప్ప భక్తులు అంబలి అందజేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వేసవిలో రాగి అంబలి కేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికుల, గ్రామస్తుల దాహార్తిని తీర్చడం మంచి నిర్ణయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరిన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు లక్ష్మయ్య, బసంత్, సతీష్, మల్లేష్, ఆశన్న, కృష్ణయ్య, రాములు, రఘు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నిక



అంబేడ్కర్ నూతన కమిటీ సభ్యులు

మరికల్: అంబేడ్కర్ యువజన సంఘంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరికల్ అంబేడ్కర్ భవనం దగ్గర సోమవారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షులు గూప నర్సింహులు, ఉపాధ్యక్షులుగా సీమ గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, సలహాదారులుగా జోగురామస్వామి, బాలకృష్ణ, తిర్మలయ్య, కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శివకుమార్, మాసన్న, కుర్మయ్య, బాలరాజ్, చెన్నయ్య, కమలాకర్ పాల్గొన్నారు.

కన్నడ భాష అభివృద్ధి కోసం అసెంబ్లీలో చర్చిస్తా

కృష్ణా: మండలంలోని కన్నడ భాష పాఠశాలల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, ఈ విషయం అసెంబ్లీలో చర్చిస్తానని కర్ణాటకలోని గుర్మిట్‌కల్ ఎమ్మెల్యే కందుకూర్ శరణగౌడ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జ్ఞాన సంఘమ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలోని గడినాడ కన్నడభాష పాఠశాలల అభివృద్ధికి ఈ ప్రాంత ప్రజలు, గడినాడ భాష ఉద్యమ నాయకులు చాలా కాలంగా పోరాటం చేస్తున్న విషయం తనకు తెలుసునన్నారు. అనంతరం నేరడగం పశ్చిమాద్రి విరక్తమఠం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి మాట్లాడారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులోని కృష్ణా మండలం ఓ ఆధ్యాత్మిక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంజనమ్మపాటిల్, అనుసూయమ్మ, తంగిడి ఆంజనేయ, రాధ, శివరాజ్ పాటిల్, సోమనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మాగనూర్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాగనూర్ ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. అంతకుముందు పాఠశాలల్లోని బియ్యం స్టాక్‌ను, కూరగాయలను పరిశీలించి ఎప్పటికప్పుడు తాజా బియ్యంతో పాటు కూరగాలు వినియోగించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు నీడ పందిళ్లు ఏర్పాటు చేయాలి



ఉపాధి హామీ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

కొత్తపల్లి: మండలంలోని మన్నాపూర్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. సోమవారం ఎంపీడీఓ కృష్ణారావు ఉపాధి హామీ ద్వారా ఫాం ఫండ్ పనులు చేస్తున్న కూలీలకు ఎండ వేడిమికి రక్షణగా మంచి నీరు, నీడ పందిళ్లు, షాడో నెట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండలంలోని గొర్లోని బాయి ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన తాజా కూరగాయలతో కూడిన భోజనం అందించాలని వంట ఏజన్సీ సిబ్బందికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు సూచించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరు తాము సంపాదించిన వాటిలో కొంతమేర సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడానికి ముందుకు రావాలని శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్ అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా జై భవానీ ఫ్రూట్ మర్చంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా తన తండ్రి కీ.శే.శివసింగ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు చందుసింగ్ సొంత డబ్బులతో చల్లటి మినరల్‌వాటర్‌ను ఏర్పాటు చేసి బాటసారులు, వాహనదారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించి పండ్ల బొకే అందించారు. కార్యక్రమంలో బాబు, శ్రీనివాస్, లింగం, పాషా, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల



మక్తల్‌లో జాతర పోస్టర్ విడుదల చేస్తున్న పీఠాధిపతి సిద్ధిలింగేశ్వర మహాస్వామి

మక్తల్: మాగనూర్ మండలం నేరడుగోమ్ గ్రామంలో శ్రీ పశ్చిమాద్రి విరక్తిమఠం శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మక్తల్ పట్టణంలో సోమవారం విడుదల చేశారు. అనంతరం ఐబీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడారు. కార్యక్రమాలకు కర్ణాటక నుంచి పీఠాధిపతులు, తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, భక్తులు హాజరవుతారన్నారు. అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శరణప్ప, మంజునాథ్, రాంమాదవ్, నర్సింహారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పెద్దకడ్మూర్‌లో తిరుమల దేవుడి ప్రతిష్ఠాపన



పెద్దకడ్మూర్‌లో తిరుమల దేవుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో నల్లచెరువుకట్టపై వెలిసిన తిరుమల దేవుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు స్వామి వారి విగ్రహాన్ని పురవీధుల్లో ప్రత్యేక భజనలు, గోవిందనామ స్మరణతో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద పురోహితులు, వేదపండితులు శ్యాం సుందర్‌జోషీ, రాఘవేందర్‌జోషీల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్వామివారి జలాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌ప్రకాష్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కాంతారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, జానకిరామ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరస్వామి ఉత్సవాలు

● స్వామివారికి భక్తుల దాసంగాలు



స్వామివారి మూలవిరాట్



స్వామివారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాదిమంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారి కర్బసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోలీ పండుగ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని, భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించినట్లు నిర్వహకులు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతోనే..

30 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో జాతర ఉత్సవాలు కనివిని ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కృతజ్ఞత సమావేశంలో నిర్వహకులు వీఎస్ రాజు, సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నాగేష్‌లు మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో మొదటిసారి చెరువులో రెండు బోట్లు నడిపించారని పెద్దలు, మహిళలు, పిల్లలు సరదాగా చెరువులో పడవ శికారు చేశారన్నారు. ఉత్సవాలకు ఆర్థికంగా సహకారం అందించిన వారితో పాటు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, మహేష్, గాలిపంపు శ్రీను, తదితరులు ఉన్నారు.

ఇటుక బట్టీలపై దాడులు



జక్లేర్ దగ్గర ఇద్దరు బాలకార్మికులను అదుపులోకి తీసుకున్న లేబర్ అధికారులు

మక్తల్/మరికల్: మక్తల్ మండలం జక్లేర్, గుడిగండ్ల గ్రామం దగ్గర ఉన్న ఇటుక బట్టీలలో దాడులు నిర్వహించి అక్కడ పని చేస్తున్న బాలకార్మికులను లేబర్ అధికారి మహేష్ అదుపులోకి తీసుకున్నారు. నారాయణపేట సీడబ్ల్యూసీ ముందు హాజరు పరిచారు. తనిఖీలో భాగంగా చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ నర్సింహులు, కౌన్సిలర్ విద్యారాణి, విజయ్, మరికల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

■ మరికల్ మండలంలో ఉన్న ఇటుక బట్టీలను లెబర్ ఆఫీసర్ మహేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఓ ఇటుక బట్టీ దగ్గర మైనర్ కార్మికురాలు పని చేస్తుండడంతో రెస్క్యూ చేసి జిల్లా సీడబ్ల్యూసీ ముందు అధికారులు హాజరు పరచడం జరిగింది. పిల్లలను ఇటుక బట్టీల దగ్గర పని చేయించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లెబర్ ఆఫీర్ హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ విద్యారాణి, డీసీపీయూ కౌన్సిలర్ విజయ్, మరికల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.